క్లుప్తంగా

దేవరుప్పుల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఆంథ్రయ్య

దేవరుప్పుల: మండల తహసీల్దార్ విభాగంలో మరో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పాసిల్ల ఆంథ్రయ్య విధుల్లో చేరారు. ఎన్నికల బదిలీలో భాగంగా బచ్చన్నపేట మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. గతంలో మండలానికి ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండగా ఇప్పటి వరకూ ఒక్కరే ఉండడంతో పాలనాపరంగా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు ఇద్దరు విధుల్లో ఉండడంతో మీసేవ తదితర సమస్యల సత్వర పరిష్కారానికి వెసులుబాటు కలుగనుంది.

పల్లాను కలిసిన నాయకులు



జనగామ: ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు శారద, సుజాత, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బచ్చన్నపేట మండల నాయకులు

బచ్చన్నపేట: ఎమ్మెల్సీ, జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పలువురు మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పూల బొకేలు అందజేశారు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లాను అధిక మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా అందించాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పలువురు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జనగామ రూరల్: ఎంపీపీ మేకల కళింగరాజు ఆధ్వర్యంలో మండలంలోని శామీర్‌పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాండ్ర ప్రసాద్ మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

తాటికొండ రాజయ్యను కలిసిన నాయకులు



చిల్పూరు: రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే రాజయ్యను మంగళవారం చిల్పూరు మండల నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ మూల నాగరాజు, లింగంపల్లి సమ్మక్క-సారలమ్మ చైర్మన్ మోతె శ్రీను, రైతు కోఆర్డినేటర్ గాదె రాజయ్య, కమలాపూర్ మండలం కన్నూరు గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె సంతోష్ తదితరులు ఉన్నారు.

అన్నదానం

బచ్చన్నపేట: వాస్విక్ ఫౌండేషన్ సేవా సంస్థ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు మంగళవారం అన్నదానం చేశారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, సభ్యులు అరుణ్, నవీన్, శ్రీశైలం, మురళి, అశోక్, మహేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

నర్మెట: గ్రామపంచాయతీలు వంద శాతం పన్నులు వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీఓ అరవింద్ చౌదరి అన్నారు. నర్మెట పంచాయతీలో మంగళవారం ఆయన రికార్డులను పరిశీలించి కార్యదర్శి కందకట్ల శ్రీధర్‌కు పలు సూచనలు చేశారు. బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి ఉన్నారు.

పగిలిన తాగునీటి పైపులైన్

జనగామ రూరల్: పెంబర్తిలోని 13వ వార్డులో నెల క్రితం తాగునీటి పైపులు పగలడంతో తాగేనీరురాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోవ డం లేదని వార్డు సభ్యులు వాపోతున్నారు. సర్వీస్ రోడ్డుపక్కన తాగునీటి పైపులైన్ వేశారు. ఇదే క్రమంలో పైపులుపగిలి ఇళ్లకు నీరు రావడం లేదు. తక్షణం నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో భాషిపల్లి సోమయ్య అనే రైతుకు చెందిన పాడిగేదె గ్రామంలోని ఎస్‌ఎస్4 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తాకడంతో విద్యుదాఘాతంతో మృతి చెందింది. పాడిగేదె మృతితో సమారు రూ.50వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. విద్యుత్ శాఖ పరంగా, ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ రామ్మూర్తి



హాజరైన ఎన్నికల అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల నియమావళి అమలులో అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఘన్‌పూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ వాసం రామ్మూర్తి అన్నారు. నియోజకవర్గంలోని ఎంసీసీ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, వీడియో సర్వైవల్ టీమ్స్‌తో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అందరూ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. నియమావళిని పకడ్బందీగా అమలు చేసేలా చూడాలన్నారు. ఎన్నికల రాజకీయ పార్టీలు, నాయకుల ఫొటోలు, హోర్డింగ్‌లు, వాల్‌పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు ఉంటే వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలైతే 24 గంటలు, పబ్లిక్ ప్రదేశాలైతే 48 గంటలు, ప్రైవేట్ స్థలాలైతే 72 గంటల్లో తొలగించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎంసీసీ టీమ్స్, ఇతర ఎన్నికల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సీఐలు పాల్గొన్నారు.

కంచనపల్లికి మరో ఎంపీటీసీ స్థానం పునరుద్ధరించాలి

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లికి ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాలకు 2019లో ఒకే స్థానాన్ని కేటాయించి అన్యాయం చేశారని, తిరిగి మరో ఎంపీటీసీ స్థానాన్ని పునరుద్ధరించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం జెడ్పీ సీఈఓకు వినతి పత్రం అందజేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాపోలు రామ్మూర్తి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓను కలిసి విజ్ఞప్తి చేశారు. 2,500 మంది ఓటర్లతో ఒక్కో ఎంపీటీసీ స్థానం ఉందని, 4,800 ఓటర్లు గల కంచనపల్లికి రెండు ఎంపీటీసీ స్థానాలకు బదులు ఒకే ఎంపీటీసీ స్థానానికి పరిమితం చేశారన్నారు. రానున్న ప్రాదేశిక ఎన్నికలో కంచనపల్లికి రెండు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ వినతికి సీఈఓ సానుకూలంగా స్పందించారని రామ్మూర్తి తెలిపారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి

తరిగొప్పుల: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండలకేంద్రం ప్రధాన కూడలి అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ మండల పరిధిలోని విద్యార్థులు చదువు కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. మోహన్, అరవింద్, చందు, అనిల్, మహిపాల్, కార్తీక్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అష్టదళ పాద పద్మారాధన పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ 108 బంగారు పుష్పాలతో ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్‌రాజు, వేల్పుల గట్టయ్య, జంగిటి కుమార్, శ్యాంసుందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చూపు కాంగ్రెస్ వైపు..

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతిపై ప్రజలందరూ విసుగుచెంది ఉన్నారని, ప్రస్తుతం ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ మహిళా కోఆర్డినేటర్ కుందూరు జ్యోతిరెడ్డి, చిల్పూరు మండల మహిళా కోఆర్డినేటర్ వడ్లూరి మౌనిక, సరస్వతి, రఘునాథ్‌రెడ్డి తదితరులు ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, చింత ఎల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, గుర్రం యాదగిరి, కోరుకొప్పుల మహేందర్‌గౌడ్, గట్టు కోటేశ్వర్, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగపురం సమ్మయ్య, జానీబాబా పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న ఇందిర

సంక్షిప్త సమాచారం

ఎన్నిక



స్టేషన్‌ఘన్‌పూర్: చర్మకార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నమిలిగొండకు చెందిన గాదె కుమారస్వామి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చర్మ కార్మికులు, డప్పు, చెప్పు కార్మికుల సమావేశంలో కుమారస్వామిని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఘన్‌పూర్‌లో చర్మ కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్‌గౌడ్

పాలకుర్తి: గౌడజన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర కార్యదర్శిగా ముత్తారం గ్రామానికి చెందిన నలమాస రమేష్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ యువజన విభాగం గ్రామ అధ్యక్షుడిగా లక్‌పతి

దేవరుప్పుల: సీత్యతండా కాంగ్రెస్ యువజన విభాగం గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుగులోత్ లక్‌పతి, ప్రధాన కార్యదర్శిగా భూక్య సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ విభాగం మండల అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి తెలిపారు. మంగళవారం సీత్యతండాలో ప్రత్యేక సమావేశంలో యూత్ కమిటీ ఉపాధ్యక్షుడిగా గుగులోత్ భాస్కర్, కార్యదర్శిగా భూక్యా బాలాజీ, కోశాధికారిగా గుగులోత్ చిరంజీవి, సభ్యులుగా ప్రభాకర్, రాజశేఖర్, శ్రీకాంత్, ప్రకాష్, సోమన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

చిల్పూరు: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మల్కాపూర్ గ్రామానికి చెందిన దోరం శ్రీనివాస్ యాదవ్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల దిలీప్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తానని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిర గెలుపును కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు.

కడియం గెలుపు కోసం..

చిల్పూరు: బీఆర్‌ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కడియం శ్రీహరి భారీ మెజార్టీతో గెలువాలనే ఆకాంక్షిస్తూ మంగళవారం ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు గుట్టపై గండదీపం వెలిగించారు. అర్చకులు కృష్ణమాచార్యులు, దయాకర్, సిబ్బంది ఉన్నారు.

నివాళి



పాలకుర్తి: సీపీఎం నాయకుడు గూన సోమయ్య(70) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం సీపీఎం జిల్లా, మండల నాయకులు సోమయ్య మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు సోమయ్య, సోమన్న, సారయ్య, సత్యం, అశోక్ బాబు, పుష్పలీల తదితరులు ఉన్నారు.

బియ్యం పంపిణీ

పాలకుర్తి: ముచ్చింతల చైర్మన్ కిరణ్ జన్మదినం సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దివ్యాంగుడు రహీమ్, రెహమాన్‌లకు బియ్యం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడీ హరిష్, ఎల్లేష్, జీడీ యశ్వంత్ పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

చిల్పూరు : భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకునే మూల సంపత్-లక్ష్మి తమపై చేసిన ఆరోపణలు అవాస్తవమని రూపేష్, సత్యనారాయణ, మల్లేషం, లీలారాణి తెలిపారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద మంగళవారం వారు మాట్లాడారు. తమ భూమిలో అక్రమంగా కట్టడాలు చేస్తుండగా వారిస్తే కేసులు పెట్టిస్తున్నారన్నారు. తమకు తప్పుడు నోటీసులు పంపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. నలిమెల కుమార్, తౌటి సునీల్, సారయ్య, నాగేందర్, హరికష్ణ ఉన్నారు.

ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి

జనగామ: తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసు లాఠీ దెబ్బలు తింటూ, ఎన్నో రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యమకారులకు బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం కల్పించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు వంగ ప్రణీత్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి పదవులు లేకుండా ఇన్నాళ్లు పనిచేస్తున్నామన్నారు. ఉద్యమకారులకు గౌరవం దక్కేలా అధిష్టానం ప్రకటన చేయని పక్షంలో, ఈ నెల 28 లేదా 30వ తేదీన పట్టణంలో ఉద్యమ కారులతో కలిసి సభ నిర్వహిస్తామన్నారు.

‘నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం’

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కడియం శ్రీహరి, డాక్టర్ తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా నియోజకవర్గానికి చేసిందేమి లేదని విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వడ్లకొండ పరశురాములు అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి మాట దేవుడెరుగు గాని అవినీతిలో మాత్రం నంబర్‌వన్‌గా ఉందని ఎద్దేవా చేశారు. కనీసం ఘన్‌పూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా తీసుకురాలేక పోయారని విమర్శించారు. కేవలం ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టడమే తప్ప అభివృద్ధిపై పట్టింపులేదన్నారు. తాను అభివృద్ధియే ఎజెండాగా ముందుకు వస్తున్నానని, ప్రజలు ఆశీర్వదిస్తే అవసరమైతే ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేస్తానన్నారు. కార్యక్రమంలో బదావత్ రాంధన్, జోద్ యాకుబ్, అశోక్, రాజు, నరేష్, మహేష్, నరేష్, ప్రవీణ్, మహేందర్, సదానందం, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

జనగామ రూరల్ : మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని, ఆ దిశగా వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ కోరారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భవిత స్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. ప్రతీ ఒక్కరిలో నైపుణ్యం ఉంటుందని, దాన్ని గుర్తించి వారు రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రుల తోడ్పాటుతో మానసిక దివ్యాంగులు రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్, శ్రీహరి, జ్యోత్స్న, ఎస్‌ఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి విక్రమ్

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



‘విశ్వకర్మ’ నమోదును ప్రారంభిస్తున్న శ్రీనివాస్

నర్మెట/తరిగొప్పుల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జనగామ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నర్మెట, తరిగొప్పులలో మండలాధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన పథకం నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోది ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తుల వారికి ఆర్థికంగా చేయూత చేకూరుతుందన్నారు.ఈ పథకంలో రూ.3 లక్షల లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేష్ గౌడ్, మండలాధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, ధరావత్ రాజు, రాందాస్, బండ ప్రసాద్, సంతోష్, కొన్నె రాజు, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం



రఘునాథపల్లి: ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ మేకల వరలక్ష్మి



దేవరుప్పులలో.. యూత్ నాయకులు



జఫర్‌గఢ్‌లో..

రఘునాథపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ స్కీంలపై మండలంలోని మల్లంపల్లి, శివాజీనగర్, శ్రీమన్నారాయణపురం మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎంపీపీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అండగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, నరేందర్, పృథ్వీ, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణ ఉన్నారు.

గ్యారంటీ పథకాల ప్రచారం

దేవరుప్పుల: ఇచ్చిన హామీలను విస్మరించని చరిత్ర కలిగిన కాంగ్రెస్ గ్యారంటీ స్కీంలు అమలు ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుగులోత్ రామచంద్రునాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బంజరలో కాంగ్రెస్ యువజన మండల నాయకుడు ఉప్పుల అనిల్ ఆధ్వర్యంలో ఇంటింటా కాంగ్రెస్ ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. దేవర వీరస్వామి చందర్, గవ్వల మహేందర్, నరేందర్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు అన్నెబోయిన భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, పేర్కొన్నారు. జఫర్‌గఢ్, వడ్డెగూడెం తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జిల్లా కిసాన్ సెల్ కోఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, ఎల్లగౌడ్, యాదగిరి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో కోడ్ అమలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం మండలాల్లో రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలు, పోస్టర్లు, వాల్‌రైటింగ్, జెండాలు, హోర్డింగ్‌లను జీపీ సిబ్బంది తొలగించారు.

- బచ్చన్నపేట/కొడకండ్ల/దేవరుప్పుల



కొడకండ్ల: వాల్‌రైటింగ్ తొలగిస్తున్న జీపీ సిబ్బంది



బచ్చన్నపేట: వాల్‌పోస్టర్లను తొలగిస్తూ..



దేవరుప్పుల: ఫ్లెక్సీలు తొలగిస్తున్న కార్మికులు

‘కర్ణాటకలో కాంగ్రెస్ మోసం’

రఘునాథపల్లి: ఐదు గ్యారంటీలని కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా చేతులెత్తేసి అక్కడి ప్రజలను మోసం చేసిందని, ఇక్కడా ఆరు గ్యారంటీలని ఆ పార్టీ చెప్పే బూటకపు మాటలను నమ్మి గోసపడొద్దని ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని మండలగూడెం, రామరాయని బంగ్లా, మేకలగట్టు, జాఫర్‌గూడెం, అశ్వరావుపల్లి, వెల్దిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు వచ్చిన కడియంకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో కడియం మాట్లాడుతూ ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని, తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ ఏం చేశారు ..? అంతకు ముందు అధికారంలో ఉన్న వారు ఏం చేశారన్నది గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని పేర్కొన్నారు. మండలగూడెం వాగు హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. సమావేశాల్లో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మారజోడు రాంబాబు, జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం మణికంఠ, సర్పంచ్‌ల ఫోరం జిల్లాఅధ్యక్షుడు పోకల శివకుమార్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, మల్కపురం లక్ష్మయ్య, నామాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



సీతారాం (ఫైల్)

తరిగొప్పుల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొత్తలపర్రె శివారు చింతలతండాకు చెందిన భూక్య సీతారాం(45) సోమవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పని నిమిత్తం మండలకేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొత్తలపర్రెకు చెందిన ముండావర్ వీరన్న తన ద్విచక్ర వాహనంపై మండలకేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొంతగట్టునాగారం సమీపంలో వీరన్న తన వాహనాన్ని వేగంతో రాంగ్‌రూట్‌లో వెళ్లి సీతారాం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సీతారాం తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం తరలించారు. కాగా, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముండావర్ వీరన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.